క్లుప్తంగా

వైభవంగా పూలాభిషేకం



మధురానగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీ షిర్డినాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం షిర్డీ సాయిబాబా పుణ్యతిథి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. షిర్డీసాయినాథుని 107వ పుణ్యతిథి సమాధి ఉత్సవాలను పురస్కరించుకుని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యాన పూజలు అభిషేకాలు, పూలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి పొంగలి సమర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ, అన్నప్రసాద వితరణ జరిగింది.

మధురంగా సాగిన వాగ్గేయకార సంకీర్తన



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో శివరామకృష్ణ క్షేత్రంలో దసరా మహోత్సవాల ముంగింపు సందర్భంగా శుక్రవారం భారతీ తీర్థ శ్రవణ సదనంలో శుక్రవారం నిర్వహించిన దేవీ సంకీర్తనల కార్యక్రమం మధురంగా సాగింది. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ఆధర్యంలో ఆయన శిష్యులతో కలసి వాగ్గేయకారులు దుర్గాదేవిమీద రచించిన కీర్తనలు విజయాంబికే, ననుగన్నతల్లి, శ్రీ సరస్వతి, మీనలోచని, హిమగిరి తనయే, సుందరీ నిదివ్యరూపము, మారవైరి రమణి, కనకశైల విహారిణి తదితర కీర్తనలను మధురంగా గానం చేశారు. లంకా తేజస్వి, వలివేటి నీరజ, కొత్తూరు శ్రీరంజని, ఎస్.సాత్విక, బీవీఎస్ కృష్ణ, శివలెంక విశ్వనాథ్, వైఎస్‌వీ కే సంతోష్ పాల్గొన్నారు. శ్రీహర్ష వాద్య సహకారం అందించారు.

'భువికోరని భ్రమణం' నాటికకు బహుమతి



విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన హర్ష క్రియేషన్స్ నాటక సంస్థ ప్రదర్శించిన సాంఘిక నాటకం భువి కోరని భ్రమణం నాటికకు జాతీయ స్థాయిలో ఉత్తమ తృతీయ బహుమతి లభించినట్లు నాటక రచయిత, దర్శకుడు కత్తి శ్యాంప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళల కాణాచి సంస్థ వీణా అవార్డ్స్ 2025 పేరుతో తెనాలిలో నాలుగు రోజుల పాటు జాతీయ స్థాయిలో సాంఘిక, పౌరాణిక నాటికల పోటీలు నిర్వహించింది. హర్షక్రియేషన్స్ తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించి కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించి ప్రదర్శించిన భువికోరని భ్రమణం నాటికకు తృతీయ బహుమతి లభించింది. ఈనెల 2న తెనాలిలో జరిగిన సభలో సినీ మాటల రచయిత బుర్రా సాయి మాధవ్, అప్పాజోస్యుల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అప్పాజోస్యుల సత్యనారాయణ నుంచి బహుమతిని అందజేశారు.

వృద్ధులకు అన్నదానం



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) ఆధ్వర్యంలో వాంబే కాలనీలోని మాతృదేవోభవ వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా పాల్గొని వృద్ధులకు భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా ఓ సేవా కార్యక్రమం చేస్తున్నామని, 46వ నెల సేవా కార్యక్రమంలో భాగంగా ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిల్డర్ నాగుల్ మీరా ఆర్థికసాయంతో వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఏఎంసీ సభ్యులు సిలార్ బేగ్, పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి అబ్దుల్‌ఆలీ, మచిలీపట్నం నాయకులు సైదా తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: భారతదేశం విశ్వగురువు కావాలని ఆర్‌ఎస్‌ఎస్ సహ ప్రాంత ప్రచారక్ జనార్ధన్‌జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సంఘ విజయవాడ మహానగర్, సత్యనారాయణపురం శాఖ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలు, విజయదశమి వేడుకలను సత్యనారాయణపురంలోని శిశువిద్యామందిర్‌లో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథి జనార్ధన్‌జీ మాట్లాడుతూ వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్రకలిగిన ఆర్‌ఎస్‌ఎస్ ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా ముందుకు సాగుతోందని సంఘటనా శక్తి మాత్రమే ఇందుకు కారణమన్నారు. వ్యక్తి నిర్మాణం, హిందూ సమాజం ప్రపంచశాంతి లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. వేదా హస్పిటల్ చైర్మన్ డాక్టర్ యడ్లపాటి శేషసాయి. సంఘ నిర్మాణం. లక్ష్యం దిశగా అడుగులు అంశంగా ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహక్ సత్యనారాయణ, నాగలింగం శివాజీ, జింకా చక్రధర్ పాల్గొన్నారు. సంఘ సభ్యులు నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది.

గాంధీమార్గం అనుసరణీయం

- రెండో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి సత్యానంద్
- జిల్లా జైలులో ఘనంగా గాంధీ జయంతి



జిల్లా జైలులో గాంధీ జయంతి కార్యక్రమం



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఖైదీలలో పరివర్తన కోసం గాంధీ సిద్ధాంతాలను అలవర్చుకోవాలని.. గాంధీ సూచించిన సత్యం, అహింసల మార్గంలో పయనించాలని రెండో అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి సత్యానంద్ సూచించారు. గాంధీ జయంతి పురస్కరించుకుని గురువారం జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానంద్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. చేయని నేరాలను ఆర్థిక లాభాల కోసం మీపై వేసుకోవద్దని సూచించారు. జైలులో ఉన్న కాలంలోనే ఖైదీలు పూర్తి సత్ప్రవర్తన కలిగి పరిపూర్ణ వ్యక్తులుగా మారాలని అన్నారు. ప్రత్యేక అతిథులుగా 12వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎం.సునీల్ కుమార్, డీఎస్‌జే జయవాడ, ఉమా మహేశ్వరరావు లీగల్ అడ్వకేట్ బి.శేఖర్ బాబు మాట్లాడారు. తొలుత గాంధీ విగ్రహానికి పూమాల వేసి నివాళులర్పించారు. కారాగారంలో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణాధికారి మహమ్మద్ ఇర్ఫాన్, జిల్లా కారాగార వైద్యాధికారి రోషన్ మియాన్, జైలర్ ఎన్.గణేష్, సీహెచ్ వేణు, డెప్యూటీ జైలర్స్ బీ.గోపయ్య నాయక్, జైలు సిబ్బంది పాల్గొన్నారు..

దుర్గాపురంలో..

దుర్గాపురం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బీ వసంతకుమార్ గాంధీజీ విగ్రహానికి పూల వేసి నివాళులర్పించారు. గాంధీజీ సేవలను కొనియాడారు. అనంతరం పండ్లు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరంగి నాగమల్లీశ్వరి, ఎస్‌కే షఫీవుల్లా, జీ ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు. తొలుత పలు ప్రాంతాలలోని గాంధీజీ విగ్రహాలను శుభ్రం చేశారు.

గాంధీ మార్గంలో నడవాల్సిన బాధ్యత అందరిది

విజయవాడలీగల్: అహింస, సత్యమేవ జయతే అనే ధర్మాలను పాటించాలని బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏకే బాషా పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతిని బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకే బాషా మాట్లాడుతూ గాంధీ 19 సంవత్సరాలకే న్యాయవాద వృత్తిని చేపట్టారని, న్యాయవాద వృత్తితోపాటు ప్రజా సంక్షేమం కోసం పోరాడుతూ అనేక పోరాటాలు చేసి స్వాతంత్ర్యం సంపాదించి ప్రజా సంరక్షణ కోసం అసువులు బాసారని గుర్తుచేశారు. మనం కూడా ఆయన బాటలోనే నడవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి బెజవాడ బార్‌లో ప్రాక్టీస్ చేసి న్యాయమూర్తులైన బి.సాదుబాబు, జి.దీన బాబు, రత్నకుమార్, పి. లలితలను అతిథులుగా ఆహ్వానించారు. బీబీఏలో న్యాయవాద వృత్తిని చేస్తూ, న్యాయమూర్తులుగా ఎదిగిన వారు మళ్లీ బార్ అసోసియేషన్‌కి రావటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ ఇదే బార్ అసోసియేషన్‌లో న్యాయవాద వృత్తి ఉండి ఇలా అతిథులుగా ఆహ్వానించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. జూనియర్ న్యాయవాదులు కూడా కష్టపడి ఉన్నత స్థితికి రావాలని కోరారు. ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ సుంకర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గాంధీ జయంతిని గాంధీ ఉత్సవ్ పేరుతో బెజవాడ బార్ అసోసియేషన్‌లో నాలుగు రోజులు ముందు నుంచే జరపటం గాంధీ స్మృతులను గుర్తు చేసుకుంటూ సబర్మతి ఆశ్రమాన్ని ఏర్పాటు చేయటం, వాటితో పాటు గాంధీ జీవిత చరిత్ర ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయటం గొప్పవిషయమన్నారు. అనంతరం కూచిపూడి నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. భవనారాయణ, డేవిడ్ రత్నకుమార్, ఉమామహేశ్వర్‌రెడ్డి, ముత్యాల రామారావును ఘనంగా సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బెజవాడ బార్ అసోసియేషన్ గవర్నమెంట్ బాడీ, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వస్తారంటూ.. దుకాణాల తొలగింపు



ముత్యాలంపాడు రావిచెట్టు సెంటర్ సమీపంలో తొలగించిన దుకాణాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఆటోడ్రైవర్‌ల సేవలో.. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు వస్తున్నారంటూ శుక్రవారం ముత్యాలంపాడు రావిచెట్టు సెంటర్ సమీపంలోని దుకాణాలు తొలగించారు. ఎంతో కాలంగా రోడ్డుకు ఒక పక్కగా రాకపోకలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేద హాకర్స్ దుకాణాలను అధికారులు ఏకపక్షంగా తొలగించారు. ముఖ్యమంత్రి వచ్చే సమయంలో రోడ్డు పక్కన పూరి పాకల బడ్డీతో ఉన్న దుకాణాలను చూస్తే తమకు ఇబ్బందులు ఎదరవుతాయంటూ అధికారులు దుకాణాలను తొలగించారు. ముఖ్యమంత్రి తమ ప్రాంతానికి వస్తే తమ పొట్ట కొడతారా అంటూ నిరుపేద హాకర్లు విచారం వ్యక్తం చేశారు. ఇక్కడ దుకానాలను ఎంతో కాలంగా పట్టించుకోని జీఎస్‌రాజు రోడ్డులోని గుంతలను మాత్రం హడావుడిగా పూడ్చివేశారు. గుంతలు పూడ్చాలంటే సీఎం రావాలన్న మాట అంటూ స్థానికులు ఛలోక్తులు విసురుకున్నారు.

రాజరాజేశ్వరీదేవీ నమోస్తుతే!

ముగిసిన దసరా శరన్నవరాత్రి పూజలు



దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారు



గంగానమ్మ దేవాలయంలో..



గద్దే వెంకట్రామయ్య నగర్‌లో..



పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో..



ముత్యాలంపాడులో శమీవృక్ష పూజ



అంకమ్మతల్లి శక్తిపీఠంలో శమీవృక్షపూజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. శుక్రవారం శమీవృక్ష పూజ అర్చనలు జరిగాయి. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సామంతపూడి చిన్నా పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు డీ వీఎస్ రాజు, దాట్ల శివరామరాజు పర్యవేక్షించారు. ముత్యాలంపాడు గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించి కుంకు మార్చనలు నిర్వహించారు. గురువారం సాయంత్రం అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించిన వాహనంలో ఉంచి ఊరేగించారు. శుక్రవారం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను అభివృద్ధికమిటీ కార్యదర్శి మందపాటి యుగంధర్ వర్మ పర్యవేక్షించారు. శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారిని శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, శ్రీలలితా సహస్రనామ పారాయణం, హోమం, పూర్ణాహుతి జరిగింది. శమీవృక్ష పూజలు జరిగాయి. శుక్రవారం స్వామివారి కల్యాణం కనుల పండువగా చేశారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు. బావాజీపేట నాలుగోలైనులో శ్రీదేవీ దర్మప్రచారపరిషత్ బచ్చు మాధవీమురళీకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. సామూహిక కుంకుమార్చనలు సాయంత్రం ఊరేగింపు జరిగాయి. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. దుర్గాపురంలో వీరమాచనేని కిషోర్ ఆధ్వర్యాన అమ్మవారిని శ్రీ రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. కార్పొరేటర్ వీరమాచనేని లలిత దంపతులు పూజలు చేశారు. సాయంత్రం ఊరేగింపు జరిగింది. మధురానగర్ మెయిన్ రోడ్డులో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. శమీవృక్షపూజ జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు. ప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు తాన్న పూర్ణచంద్రరావు పర్యవేక్షించారు. జీవీఆర్‌నగర్‌లో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి కుంకుమార్చనలు, శమీవృక్ష పూజలు చేశారు. కార్యక్రమాలను జీవీఆర్‌నగర్ భక్తబృందం సభ్యులు గద్దే శ్రీను, నూతక్కి శ్రీను పర్యవేక్షించారు.

వైభవంగా దేవతల గ్రామోత్సవం



విలేజి కంద్రికలో బోనాలతో వచ్చిన మహిళలతో మల్లాది విష్ణు తదితరులు

పాయకాపురం(విజయవాడరూరల్): 64వ డివిజన్ విలేజి కంద్రిక యాదవ బజారులో గురువారం జరిగిన దసరా పండుగ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వైఎస్సార్ సీపీ విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు సర్నాల తిరుపతిరావు, కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ, నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు. ఎడ్లబండితో దేవతల గ్రామోత్సవంలో, బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం రాజ రాజేశ్వరిదేవి అలంకరణ దర్శనమిచ్చిన అమ్మవారికి పూజలు చేశారు. గ్రామస్తులు దసరా పండుగ వేడుకగా చేసుకున్నారు. రాజీవ్‌నగర్లోని నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయంలో రాజ రాజేశ్వరిదేవికి భక్తులు పూజలు నిర్వహించారు. వాసవీమాత దేవస్థానంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. కంద్రిక, ప్రజాశక్తినగర్ ప్రాంతాల్లో దసరా పండుగను ఆనందంగా చేసుకున్నారు.

అంబేడ్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికుల నిరసన

9 నెలల వేతనాలు విడుదల చేయాలని వినతి



అంబేడ్కర్ స్మృతి వనం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని సీఐటీయూ నగర అధ్యక్షుడు కే దుర్గారావు హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం వద్ద ప్రభుత్వం, కాంట్రాక్టరు వైఖరిని నిరసిస్తూ కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంబేడ్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులుకు నెలల తరబడి వేతనాలు పెండింగ్ లో ఉండటంవల్ల వారి కుటుంబాలను రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్మికుల సమస్యలపై అనేకసార్లు ప్రభుత్వ అధికారులు, కాంట్రాక్టర్‌కు విన్నవించినా ఫలితం శూన్యం మన్నారు. కార్మికులకు 9 నెలలుగా జీతాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, కాంట్రాక్టర్, వి.ఎం.సి అధికారులు జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనా కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఏం.బాబూరావు, ఎం.సోమేశ్వరరావు అంబేడ్కర్ స్మృతి వనం కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీసాయినాథుని పుణ్యతిథి



పుణ్యతిథి మహోత్సవాలలో డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి, ఇన్‌కంటాక్స్ చీఫ్‌కమిషనర్ సునీత

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో షిర్డీసాయినాథుని 107వ పుణ్యతిథి మహోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గురువారం బాబా వారికి క్షీరము, విభూదితో, శుక్రవారం పంచామృతములతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ సాయినాథ, వారాహి హోమం నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, పంచసూక్త పఠనం జరిగింది. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ చీఫ్‌కమిషనర్ సునీత బిళ్ళ ముఖ్యఅతిథిగా గౌతంరెడ్డితో కలిసి బాబావారికి పూజలు చేశారు. ఆమె మాట్లాడుతూ విశేషంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ ఆంధ్రాషిర్డీగా తీర్చిదిద్దిన మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డిని అభినందించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి, లఖంరాజు సునీత ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. 31వ డివిజన్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో షిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా జరిగాయి. బాబావారికి అన్నాభిషేకం నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. తంగెళ్ళమూడి వీరమోహన రావు పర్యవేక్షించారు. 29వ డివిజన్ మధురానగర్ ఓంకార క్షేత్రం శ్రీభగవాన్ షిర్డీసాయిబాబా మందిరంలో శుక్రవారం షిర్డీసాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు వలివేటి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, వీవీఎల్ఎన్ రాజ దంపతులు పూజలు చేశారు. మందిర కమిటీ నాయకులు వైవీ శివాజీ, మలిశెట్టి బాలవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ధార్మిక మండలి అమ్మవారి గుడిలో భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేస్తున్న మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణపురం ధార్మిక మండలి ఆధ్వర్యంలో గిరివీధిలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానిక కార్పొరేటర్ శర్వాణిమూర్తితో కలసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అనంతరం జీఎస్ రాజురోడ్డులోని వాసవి మాత అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతికే విజయదశమి అని అన్నారు. ప్రతి ఒక్కరూ అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ 33వ డివిజన్ ఇన్‌చార్జి దోనేపూడి శ్రీనివాసరావు, చిరువోలు ప్రసాద్, చాంద్‌శర్మ, సనత్‌కుమార్, చంద్రశేఖర్, శేషమురళి, కృష్ణమోహన్, ఒగిరాల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ వెలుగుల్లో ఇంద్రకీలాద్రి



కృష్ణవేణి ఘాట్ వద్ద భవానీలు



భవానీ మాతకు జై

దసరా ఉత్సవాలు ముగిసినా భవానీ భక్తుల రాకతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. దుర్గమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన వేలాది మంది భవానీలతో క్యూలైన్లు రద్దీగా మారాయి. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భవానీలు తరలి వచ్చారు. కనకదుర్గమ్మ కాపాడు తల్లి అంటూ భవానీలు అమ్మవారిని స్మరించుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కేరళ వాయిద్యాల సందడి



కొండపైకి వెళుతున్న భవానీలు



నృత్య ప్రదర్శనలో బాలికలు

వైభవంగా శ్రీవారికి పుష్పయాగం

విజయవాడ కల్చరల్: కంచికామకోటిపీఠస్థ శారదా చంద్రమౌళీశ్వర, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లబ్బీపేటలోని శ్రీవెంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం ఉదయం ముగిశాయి. స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజను నిర్వహించారు. పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం వివిధ వర్ణాలతో కూడిన 500 కేజీల పూలతో పుష్పయాగం చేశారు. దేవాలయ కార్యక్రమ పర్యవేక్షకుడు డాక్టర్ రామ్మోనరావు మాట్లాడుతూ ఆగమ శాస్త్ర నియమానుసారం దేవాలయంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించామన్నారు. దేవాలయంలో జరిగే కార్యక్రమలలో భక్తులు పాల్గొన వచ్చని తెలిపారు. మేనేజర్ శర్మ పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.